షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 251 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 23 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 251 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 23 july 2024 PAGES : 8 PRICE : 5/-



# ఐదేళ్లలో విధ్వంసం



- జగన్‌పై విమర్శల దాడి..
- వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని రంగాలు కుదేలు
- అసెంబ్లీలో గవర్నర్ అబ్దుల్ నజీర్
- గవర్నర్ ప్రసంగంలో సగ భాగం మాజీ సీఎం పాలనపైనే ఉండటంతో తీవ్ర విమర్శలు

**అమరావతి**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలన అంతా విధ్వంసంగా మారిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అసెంబ్లీలో చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నర్‌ప్రసంగించారు. సీఎం చంద్రబాబు విజనరీ నాయకుడని కొనియాడారు. విభజన వల్ల ఏపీకి నష్టం కలిగింది. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోయాం. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ఏపీ అభివృద్ధి, రాజధాని నిర్మాణానికి ఆయన తీవ్రంగా కృషి చేశారు. 2014%–%19 మధ్య రాష్ట్రంలో పెట్టుబడుల వరద కొనసాగింది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలు నష్టాలను చవిచూశాయి. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు చురుగ్గా పాలొన్నారు. మార్పు కావాలని ఆకాంక్షించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత సభ్యులపై ఉందిఅని గవర్నర్ అన్నారు. జగన్ వల్ల ఆంధ్రప్రదేశంలో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడిందని, రాష్ట్రంలో చీకటి పాలన కొనసాగిందని గవర్నర్ - మిగతా3లో



# నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

(అంకుశం, అమరావతి, జూలై 22) :ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా ఇటీవల ఎన్నికైన ఇద్దరు అభ్యర్థులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సి. రామచంద్రయ్య, పిడుగు హరి ప్రసాద్ లతో మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారికి అభినందనలు తెలుపుతూ, శాసన పరిషత్తు నియమ నిబంధనల పుస్తకాలను నూతన ఎమ్మెల్సీలకు చైర్మన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, జాయింట్ సెక్రటరీ ఎం. విజయ రాజు తదితరులు పాల్గొన్నారు.



# పోలవరంపై కీలక ముందడుగు

## పోలవరం ప్రాజెక్ట్ మొదటి దశ నిర్మాణానికి రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం



**న్యూ ఢిల్లీ/అమరావతి**

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో కీలక ముందడుగు పడింది. పోలవరం ప్రాజెక్ట్ మొదటి దశ నిర్మాణానికి రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. కేంద్ర కేబినెట్ ఆమోదంతో ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరిణామంతో శరవేగంగా పనులు జరగనున్నాయి. కూటమి సర్కార్‌కు ఇదొక తియ్యటి కబురే అని చెప్పుకోవచ్చు. ఈ ప్రకటన తర్వాత.. ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సహకారంతో పోలవరం సవాళ్ళను అధిగమిస్తూ ముందుకు వెళతామన్నారు. పోలవరానికి రావాల్సిన రూ. 12,157 వేల కోట్లు త్వరగా ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. ఇందులో 8 వేల కోట్ల రూపాయిలు పునరావసానికి ఖర్చు చేయాల్సి ఉందని చెప్పారు. కాగా.. వైసీపీ పాలనలో కేంద్రం ఇచ్చిన - మిగతా3లో



## మంత్రి అల్లుడి కోసం

# కొత్త పోస్టు!

- కర్ణాటక అసెంబ్లీలో 'సెక్రటరీ-2' సృష్టి
- ఆర్థిక విభాగం ఆమోదానికి స్పీకర్ లేఖ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల ధ్వజం

# ప్రజలు అధికారం ఇచ్చారు.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

- గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి
- అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు



**అమరావతి**

అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలు, ప్రజా సమస్యలు, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, ఫలితాలు, ఎమ్మెల్యేల బాధ్యత, పనితీరు వంటి అంశాలకు సంబంధించి సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం గవర్నర్ ప్రసంగం తర్వాత అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం ఆయన కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకం పెట్టుకుని అధికారం మన చేతిలో పెట్టారు. ప్రజల ఆ నమ్మకాన్ని మనం నిలబెట్టేలా - మిగతా3లో

# అసెంబ్లీ నుంచి వైఎస్సార్‌సీపీ వాకౌట్



- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగ మొదలైన సమయంలోనూ 'హత్యా రాజకీయాలు నశించాలి.. సేవ్ డెమోక్రసీ' నినాదాలు
- అయినా గవర్నర్ ప్రసంగం కొనసాగించడంతో నిరసనగా వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ నుంచి వాకౌట్

**అమరావతి**

ఆంధ్రరాష్ట్రంలో హింసాత్మక పాలన జరుగుతోందని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో గళం విప్పింది. శాసనసభ సమావేశాలు మొదలైన నేపథ్యంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ - మిగతా3లో



# ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మల దహనం

- 15న దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీ
- సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా దేశవ్యాప్త ఆందోళనకు పిలుపు
- ఈ ఆందోళనల్లో రైతులు, రైతు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని

# భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది'



- 2023-24 ఆర్థికసర్వేను లోక్ సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి
- 'భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది'
- ప్రపంచ అస్థిరతల నడుమ అధిక వృద్ధి ఆకాంక్షలు కలిగిన దేశానికి మార్పు మాత్రమే స్థిరంగా ఉంటుంది
- వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణం వంటి కీలకమైన ప్రపంచ సమస్యలపై ఒప్పందాలను చేరుకోవడం కష్టంగా మారింది

# ఐదేళ్లలో విధ్వంసం..

-మొదటిపేజీ తరువాయి

తనప్రసంగంలో పేర్కొన్నారు.

2019లో జూన్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జగన్ ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభించారు. 2024 జూన్‌తో తన పాలన ముగిసే వరకు నిరంతరాయంగా విధ్వంసం కొనసాగిందని గవర్నర్ ప్రసంగించారు. ఈ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. దీంతో జీవించే స్వేచ్ఛను కూడా కోల్పోయారు. పాలన.. ప్రతీకారం రాజకీయాలు రాష్ట్ర శ్రేయస్సును అభివద్ధి అవకాశాలను తీవ్రంగా దెబ్బ తీశాయి. అంటూ గవర్నర్ తన ప్రసంగంలో జగన్‌పై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రాజ్యాంగ పరమైన విచ్ఛిన్నం జరిగిందా అనే అంశంపై న్యాయ విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కోరినట్లు తన ప్రసంగంలో చెప్పారు. బ్రాండ్ ఏపీకి అతి పెద్ద నష్టం జరిగింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు చెప్పుకోదగ్గా సంస్థలేవీ ముందుకు రాలేదు. అన్ని స్థాయిల్లో అవినీతి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆదాయాన్ని ఆర్జించే శాఖల్లో పాలన సాధనాలను ఆయుధాలుగా మార్చుకున్నారు.

చెక్స్ అండ్ బ్యాలెన్స్ దెబ్బతినడం వల్ల అనేక ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు నిర్వీర్యమయ్యాయి. అప్పటి వరకు ఉన్న ఔత్సాహిక పెట్టుబడి దారులు, పారిశ్రామిక వేత్తలు ఆంధ్రప్రదేశ్‌ను వదిలి వెళ్లాల్సి వచ్చింది. ఈ అనిశ్చిత ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడటం వల్ల మొత్తం ప్రజల విశ్వాసాన్ని, పెట్టుబడుదారుల నమ్మకాన్ని గందరగోళానికి గురి చేశాయి. ఆదాయ వద్ధి పరిమితం, ఖర్చులు మాత్రం అపరిమితంగా ఉన్నాయి. అప్పులు, చెల్లింపులు బాగా పెరిగాయి. విద్యుత్ రంగంలో అప్పులు పెరిగాయి. మూల ధన వ్యయాన్ని నిర్లక్షం చేయడం వల్ల ఆర్థిక దుర్వినియోగం జరిగింది. దీంతో కార్పొరేషన్‌లు బలహీన పడ్డాయి.



రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నందు వల్ల బిల్లుల చెల్లింపుల్లో కూడా తీవ్ర జాప్యం జరిగింది. జలవనరులపై మూల ధన వ్యయం 56 శాతానికి తగ్గింది. రోడ్లు, భవనాలుపై భయంకరంగా 85 శాతానికి తగ్గింది. ఈ ఐదేళ్లల్లో రాష్ట్ర సొంత పన్నులకు సంబంధించి వార్షిక వద్ధి రేటు 12.8 శాతం నుంచి 8.1 శాతానికి పడిపోయింది. రెవిన్యూ వ్యయం 7.8 శాతం నుంచి 10.5 శాతానికి పెరిగింది. మూల ధన వ్యయం వద్ధి దారుణంగా 26.4 శాతం నుంచి 3.4 శాతానికి పడిపోయింది. అంటూ జగన్ ప్రభుత్వ పాలనపై గవర్నర్ నజీర్ ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివద్ధికి కేంద్ర బిందువుగా భావించిన అమరావతి రాజధాని ప్రాంతం పూర్తిగా నాశనమైంది. నాటి జగన్ ప్రభుత్వం వికేంద్రీకరణ ముసుగులో మూడు రాజధానుల ఆలోచన ప్రజలను గందర గోళానికి గురి చేసిందని పేర్కొన్నారు. భూ ఆక్రమణలు, ఇంటి స్థలాల కేటాయింపుల్లో దుర్వినియోగం, భూముల కేటాయింపుల్లో ఉలంఘనలు, రీ సర్వే పేరుతో భూ హక్కు చట్టంపై ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బ తీశారు. 1.75 లక్షల ఎకరాల్లో రూ. 35,576 కోట్లు నష్టం జరిగింది. ఎర్రచందనం దొంగల దోపిడీకి గురవుతూనే ఉంది. విశాఖలోని రుషి కొండ, మడ అడవుల విధ్వంసం వల్ల రాష్ట్ర వారసత్వ సంపద, సంస్కృతిని దెబ్బ తీశారని పేర్కొన్నారు.

# ప్రజలు అధికారం ఇచ్చారు.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

పాలన అందించాలి...నడుచుకోవాలి. గత ప్రభుత్వం వ్యవస్థలను పూర్తిగా నాశనం చేసింది. ఆర్థిక శాఖ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఏ రాష్ట్రంలోనూ ఈ పరిస్థితి ఉండి ఉండదు. ¿ కనీసం అత్యవసర పనులకు కూడా నిధులు ఖర్చు చేయలేని పరిస్థితికి ఖజానాను తీసుకువెళ్లారు. గత ప్రభుత్వ అసమర్థ, విధ్వంస నాయకత్వం కింద అధికారులు గాడి తప్పారు, వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. మన ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు, సమస్యలు ఉన్నాయి...అవన్నీ పరిష్కరించుకుంటూ సంక్షేమం, అభివద్ధి అందించాలి. నాడు ప్రజాస్వామ్యం అనేది లేకుండా పాలన చేశారు. పవన్ కళ్యాన్ విశాఖ వెళితే అక్కడ అడ్డుకున్నారు. అక్రమంగా నన్ను జైల్లోపెట్టిన సందర్భంలో పరామర్శకు వస్తుంటే కూడా అడ్డుకున్నారు. ప్రతిపక్ష నేతగా నాడు ఎక్కడికి వెళితే అక్కడ ఆటంకాలు సష్టించారు. నేను ఎక్కడికి వెళితే అక్కడ ఆపారు. 5 ఏళ్లు జగన్ ప్రభుత్వం చేయని అరాచకం అంటూ లేదు. అయినా నాడు జగన్ చేసినట్లు మనం చేయకూడదు. వాళ్లు రాష్ట్రాన్ని దోచుకోవడానికి వచ్చారు. దోచుకున్నారు. వెళ్లిపోయారు. మనం రాష్ట్రాన్ని నిలబెట్టడానికి, ప్రజలకు మంచి చేయడానికి వచ్చాం. నాడు అత్యంత పాశవికంగా వివేకా హత్య....హత్య చేసి టీడీపీ వాళ్లపై తోసేశారు. వివేకా హత్యపై ఎన్ని డ్రామాలు ఆడారో మనం చూశాం. ¿ తప్పులు చేసి తప్పించుకోవడంలో వాళు అరితేరారు. తాజాగా మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీస్ లో ఫైళ్ల దగ్ధం ఘటన అందుకు ఉదాహరణ. మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీసులో అసైన్డ్ భూములు, 22 ఎ భూముల వివరాలు ఉన్న ఫైల్స్ తగలబడ్డాయి. ఇది అగ్నిప్రమాదం అని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనేక అనుమానాలు



ఉన్నాయి. ఉదయం విషయం తెలిసిన వెంటనే హుటాహుటీన డీజీపీని నేను అక్కడికి పంపాను. విచారణ వేగవంతం చేయాలని ఆదేశించాను. మదనపల్లి ఘటన చూశాక...అడ్మినిస్ట్రేషన్ ఎలా ఉంది..ఎంత పతనం అయ్యిందనేది స్పష్టం అవుతుంది. వ్యవస్థలు, అధికారుల్లో ఒక నిర్లిప్తత వచ్చింది. అందుకే అధికారులకు గట్టి ఆదేశాలు ఇచ్చి ఉరుకులు పెట్టించాను. వైసీపీ ఫేక్ ప్రచారం ఎలా చేస్తుంది అనడానికి వినుకొండ హత్య మరో ఉదాహరణ వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యపై జగన్ ఏకంగా రాష్ట్రపతి పాలన పెట్టాలి అంటున్నాడు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ విషయంలో చాలా గట్టిగా ఉంటాం. ఇందులో ఎవరికీ ఎటువంటి అనుమానం లేదు. ¿ పవన్ కళ్యాన్ కోరినట్లుగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం. డిల్లీ పర్యటనలో రాష్ట్ర పరిస్థితులు కేంద్రానికి వివరించాం. రాష్ట్రానికి సాయం చేసే విషయంలో వాళ్లు సానుకూలంగా ఉన్నారు. మూడు పార్టీల నేతలు కలిసి పనిచేయాలి. ఎవరి సెంటిమెంట్ దెబ్బతినకుండా చూడాలి. ఉచిత ఇసుక ఇచ్చాం....దాన్ని సక్రమంగా అమలు అయ్యేలా చూడాలి అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సునీత టార్గెట్ పూర్తయినట్టేనా

**కడప :** వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత అనుకున్నది సాధించారు. జగన్ ప్రభుత్వాన్ని దించేయాలని అనుకున్నారు. జగన్ ఓటమికి తాను కూడా కొంత కారణమయ్యారని చెప్పకతప్పదు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తన తండ్రి వైఎస్ వివేకా హత్యపై నిజానిజాలు నిగ్గుతేల్చాలని ఆమె గత నాలుగేళ్లు పెద్ద యుద్ధమే చేశారు. న్యాయపరంగా హత్య కేసుపై పోరాటం చేశారు. హత్య కేసును ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని సుప్రీంను ఆశ్రయించారు. అలాగే నిందితుల బెయిల్ ను రద్దు చేయాలని పెద్దయెత్తున పోరాటం చేశారు. అప్పటి జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిరోజూ మీడియా సమావేశాలతో హోరెత్తించేవారు. . ఇక ఎన్నికల సమయంలో కడప జిల్లాలో తన సోదరి వైఎస్ షర్మిలతో కలసి విస్తృతంగా ప్రచారం చేశారు. జగన్ ను పులివెందులలో ఓడించాలని, ఏపీలో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని గద్దించారు. అలాగే వైఎస్ అవినాష్ రెడ్డిని కూడా ఓడించి వైఎస్ వివేకా ఆత్మకు శాంతి చేకూర్చాలని పదే పదే గ్రామ గ్రామాన తిరిగి ప్రజలకు పిలుపు నిచ్చారు. అయితే అందులో ఒకటి సాధ్యమంది. తన సోదరుడు జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో ఒక పాత్రనయితే పోషించగలిగారు. ఇక పులివెందులలో జగన్ ను



ఓడించడంలో, కడప ఎంపీగా వైఎస్ అవినాష్ రెడ్డిని పరాజయం పాలు చేయడంలో మాత్రం ఆమె సక్సెస్ కాలేకపోయారు. కడప జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీకి కేవలం మూడు శాసనసభ స్థానాలు వచ్చాయంటే ఖచ్చితంగా వైఎస్ సునీత ప్రభావం కొంత చూపించిందని అనేవాళ్లు చాలా మంది ఉన్నారు. ఎందుకంటే 2019 మార్చి 14వ తేదీన ఆయన పులివెందులలోని ఆయన సొంత గృహంలో దారుణ హత్యకు గురయినప్పటికీ ఇంత వరకూ ఆయన హత్యకు గల కారణాలు తెలియరాలేదు. అలాగే హంతకులు ఎవరు? ఎవరు హత్యచేయించారన్న దానిపై కూడా క్లారిటీ లేదు. దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా అంతూ పొంతూ లేకుండా కేసు నడుస్తుంది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ను కాదని వైఎస్ సునీత న్యాయస్థానాన్ని ఆశ్రయించి సీబీఐ విచారణకు ఆదేశించేలా శ్రమించారు. కానీ ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం మారింది. తాను ఈ కేసులో ఆరోపణలు చేస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డి మరోసారి కడప ఎంపీగా విజయం సాధించారు. కేంద్రంలో మాత్రం ప్రభుత్వం మారలేదు. అయితే వైఎస్ సునీత వాయిస్ ఇప్పుడు ఎక్కడా వినిపించడం లేదు. జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న తన టాస్క్ ముగిసిపోయినట్లు ఆమె వ్యవహరిస్తున్నారని కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. తన సోదరుడి ప్రభుత్వం చేసిన పోరాటం ఇప్పుడు ఏమయిందని కొందరు నేరుగా ప్రశ్నిస్తున్నారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులే కావడంతో కొన్ని రోజులు ఆగాలని ఆమె నిర్ణయించుకున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. మొత్తం సిస్టర్ సునీత వాయిస్ వినిపించకపోవడం ఏపీ రాజకీయాలలో హాట్ టాపిక్ గానే మారింది.

## అసెంబ్లీ నుంచి వైఎస్సార్‌సీపీ వాకౌట్



-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల కండువాలు ధరించి సభకు హాజరయ్యారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగ మొదలైన సమయంలోనూ 'హత్యా రాజకీయాలు నశించాలి.. సేవ్ డెమోక్రసీ' నినాదాలు చేశారు. అయినా గవర్నర్ ప్రసంగం కొనసాగించడంతో నిరసనగా వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ నుంచి వాకౌట్ చేశారు.

**గుర్తుపెట్టుకోండి.. కాలం ఒకేలా ఉండదు**

**అసెంబ్లీ గేట్ వద్ద పోలీసుల తీరుపై జగన్ ఆగ్రహం**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై అసెంబ్లీ గేట్ వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల కండువాలు ధరించి సేవ్ డెమోక్రసీ ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ గేట్ వద్ద వైయస్ఆర్ సీపీ ప్రజాప్రతినిధుల చేతుల్లో ఉన్న ఫ్లకార్డులు, పేపర్లను పోలీసులు దౌర్జన్యంగా లాక్కొని చించేశారు. పోలీసుల తీరుపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దగ్గర నుంచి పేపర్లు లాక్కొని ఇష్టారీతిగా చింపే అధికారం ఎవరిచ్చారు. మధుసూదన్ రావు గుర్తుపెట్టుకో.. ఎల్లకాలం ఇదే మాదిరిగా ఉండదు. ప్రజాస్వామ్యంలో ఉన్నాం మనం, మీ టోపీల మీద ఉన్న సింహాలకు అర్థం అధికారంలో ఉన్నవారికి సెల్యూట్ కొట్టడం కాదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం మీరున్నారని గుర్తుపెట్టుకోండిచీచీ అని సభ్యుల పట్ల దౌర్జన్యంగా ప్రవర్తించిన పోలీసు అధికారులకు సీఎం వైయస్ జగన్ వార్నింగ్ ఇచ్చారు. అనంతరం పోలీస్ జులుం నశించాలని వైయస్ఆర్ సీపీ ప్రజాప్రతినిధులు నినాదాలు చేశారు.

## కేంద్రం శుభవార్త.. పోలవరంపై కీలక ముందడుగు

-మొదటిపేజీ తరువాయి

నిధులన్నీ ఇష్టానుసారం వాడేసి ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు కోకొల్లలు. అందుకే కూటమి సర్కార్ రాగానే తొలుత పోలవరంపైనే సీఎం నారా చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ప్రతి సోమవారం పోలవరం కోసమే కేటాయిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా.. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రుల దృష్టికి పలుమార్లు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధుల విషయాన్ని మాట్లాడారు. దీంతో పాటు.. పార్లమెంట్ సమావేశాలతో పాటు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్ పాటిల్‌ను ప్రత్యేకంగా కలిసి ఎంపీలు నిశితంగా వివరించారు. ఈ క్రమంలోనే ప్రాజెక్ట్ కోసం రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. సో.. చంద్రబాబుతో పాటు ఎంపీల ప్రయత్నాలు ఫలించాయన్న మాట.

**భారీగా ఇవ్వాలని..!**

ఇదిలా ఉంటే.. ఇవాళ పార్లమెంట్ సమావేశాల్లో పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి అయ్యేందుకు కేంద్రం భారీగా నిధులివ్వాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరడం జరిగింది. రూల్‌– 377 కింద పోలవరం ప్రాజెక్ట్ నిధులపై ఆయన మాట్లాడి.. పోలవరం నిర్మాణానికి కేంద్రం తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. మిషన్ మోడ్ కింద పోలవరం ప్రాజెక్ట్‌ను తిరిగి ట్రాక్‌లోకి తీసుకువచ్చేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్న విషయాన్ని లోక్‌సభలో తెలియజేశారు. ప్రాజెక్ట్ పూర్తయితే దేశంలోని ఆరు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందన్న విషయాన్ని పార్లమెంట్‌లో కేశినేని చిన్ని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో సివిల్ పనులు 3.84%, భూ సేకరణ పనులు 3.89% మాత్రమే జరిగాయని.. 2019 నాటికి, సివిల్ పనులు 71.93%, భూసేకరణ పునరావాసం పనులు 18.66% పూర్తి అయ్యాయని లోక్‌సభలో నిశితంగా ఎంపీ వివరించారు. పోలవరం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, భవిష్యత్తుకు ప్రాణాధారం అని కేశినేని చిన్ని చెప్పుకొచ్చారు.

## చంద్రగిరిలో వేడెక్కిన రాజకీయాలు




**తిరుపతి :** చంద్రగిరిలో వైసీపీ, టీడీపీ పంచాయితీ మరింత ముదురుతోంది. అంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన అల్లర్ల నుంచి ఈ వార్ కంటిన్యూ అవుతోంది. తాజాగా మరోసారి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పులివర్తి నాని మధ్య మాటల యుద్ధం ఫీక్ స్టేజీకి చేరింది. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో మళ్లీ రాజకీయ వేడి రాజుకుంటోంది. ఎన్నికలకు ముందు ఆ తర్వాత ఒకటేలా సాగుతోంది. పులివర్తి నాని వర్సెస్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లు, ఆరోపణలు వార్నింగులు కొనసాగుతున్నాయి. సై అంటే సై అంటున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇప్పుడు బస్తీమే సవాల్ అంటున్నారు. ఇప్పటికే ఎన్నికల తర్వాత జరిగిన అల్లర్లకు మీరంటే మీరు బాధ్యులు అంటూ మాటల తూటాలు పేలుస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి టీడీపీ వైసీపీ నేతల మధ్య డైలాగ్ వార్ స్టార్ట్ అయింది. 5 ఏళ్లలో ప్రశాంత చంద్రిగిరిని చేశానంటున్న చెవిరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రగిరిలో ఒక్కరినీ కూడా ఇబ్బంది పెట్టలేదంటున్నారు. చంద్రగిరికి చంద్రబాబు, భువనేశ్వరి, లోకేష్ వస్తే కూడా గౌరవించానంటున్న చెవిరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు హుందాగా వ్యవహరించా నంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లో చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని 34 మంది వైసీపీ శ్రేణులపై కొందరు ముసుగు ధరించి భౌతిక దాడులకు దిగారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. ప్రశాంత వాతావరణంలో నియోజకవర్గ ప్రజలు జీవిస్తున్నారని, వారిని భయభ్రాంతులకు గురిచేసేందుకు ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైసీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని వార్నింగ్ ఇచ్చారు. గతంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తన సహకారంలో పులివర్తి నాని తన సొంత పనులు చక్కబెట్టుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కౌంటర్ ఇచ్చారు. చెవిరెడ్డి తప్పు చేశారు కాబట్టే నింద మోపుతున్నారని ఆరోపించారు. తనపై జరిగిన దాడిలో ఆయన పాత్ర ఉందన్నారు. సాంకేతికంగా దొరికిపోతారనే భయంతోనే ఆరోపణలు చేస్తున్నారని పులివర్తి నాని అన్నారు. అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డితో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. చెవిరెడ్డి అక్రమాలపై విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబును కూడా కోరినట్లు చెబుతున్నారు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని. ఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేసుకుంటూ మళ్లీ రాజకీయాన్ని వేడెక్కించారు. అయితే చంద్రగిరి అల్లర్ల పై మాత్రం ఒక్కో పార్టీదీ ఒక్కో వాదన.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# నేతలెక్కడ..?

## కార్యకర్తలున్నా కనిపించని నాయకులు
## అయోమయంలో ద్వితీయ క్యాడర్
## ఇదీ వైసీపీ నేతల తీరు తెన్నూ





(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 22)

జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించడంతో రాష్ట్ర స్థాయిలో ప్రతిపక్షాన్ని సైతం కోల్పోయి కేవలం 11 మందితోనే వైసీపీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇదే క్రమంలో జిల్లాలోని యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలు మినహా మిగతా చోట్లా టిడిపి జెండా రెపరెపలాడింది. దీంతో నాయకులు విస్మయానికి గురయ్యారు. బలమైన కార్యకర్తలున్నా గెలవకపోవడంతో తీవ్ర మనస్థాపానికి లోనయ్యారు. దీనికి తోడు రాష్ట్రంలో వైసీపీ అధికారాన్ని కోల్పోవడంతో అయోమయంలో పడ్డారు. నియోజకవర్గాలకు దూరమయ్యారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకుల పరిస్థితి అడ కత్తెరలో పోకచెక్కలా మారింది. పార్టీలో ఉండాలా... బయటకు వెళ్లాలా అన్నది అర్థం కాక మదనపడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు టిడిపిలో చేరేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నా స్థానికంగా ఉండే టిడిపి నాయకులు ప్రతిఘటిస్తున్నారు. చేర్చుకునే ప్రశక్తే లేదంటూ నేతలను నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ద్వితీయ శ్రేణి నేతలను నిలుపుకోలేక, కార్యకర్తలకు అండగా ఉండలేక నేతలు మదన పడుతూ నియోజకవర్గాలకే దూరంగా ఉంటున్నారు.

### జిల్లాలో వైసీపీ పరిస్థితి ఇలా..

ఒంగోలు మాజీ మంత్రి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రాజకీయ పయనంపై జిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. రానున్న రోజుల్లో వైసీపీలోనే కొనసాగుతారా లేక జనసేన పార్టీ తీర్థం పుచ్చుకుంటారా అన్న చర్చ కూడా హల్‌చల్ చేస్తోంది. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి బాలినేనికి తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకపోవడంతోనే జిల్లాలో పార్టీ పరిస్థితి దయనీయంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాను ఒంటిచేత్తో శాసించిన బాలినేనికి ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యత పూర్తి స్థాయిలో కల్పించకపోవడం, అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం ఏకపక్షంగా వ్యవహరించడంతో పార్టీ భారీ మూల్యం చెల్లిస్తుందన్న చర్చ సాగింది. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బాలినేని చెప్పిన అభ్యర్థులకు టికెట్ కేటాయించడంతో మెజార్టీ అభ్యర్థులు గెలుపొందారు. కానీ ప్రస్తుతం మాత్రం అందుకు భిన్నంగా జరగడంతో పలు అంశాలపై జగన్ ప్రాధాన్యత కల్పించకపోవడంపై బాలినేని కినుకుగా ఉన్నారు. దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో బాలినేని కీలక మంత్రి పదవుల్లో ఉండటమే కాకుండా జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పారు. వైయస్ మరణం అనంతరం కాంగ్రెస్ పార్టీ వీడి వైసీపీ గూటికి చేరి జగన్ వెంటే నడిచారు. 2014 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలైంది. అదే విధంగా బాలినేని కూడా ఓటమి పాలై ఒంగోలు ఎంపీగా మాత్రం జగన్ బాబాయి వైవి సుబ్బారెడ్డి గెలుపొందారు. ఆ సమయంలో వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది.

### జిల్లాలో పట్టుకోసం పోటా... పోటీ

జిల్లా రాజకీయాలపై వైవి సుబ్బారెడ్డి పట్టు సాధించేందుకు కృషి చేశారు. ఏ విషయంలోనూ రాజకీయంగా వీరిద్దరి మధ్య పొసగని పరిస్థితి నెలకొంది. జిల్లాలో వైవీ సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి గ్రూపులు రెండుగా విడిపోయి ఎవరికి వారే యమునాతీరే అన్న రీతిలో ఉన్నారు. 2019 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా వైవీ సుబ్బారెడ్డిని కాదని మాగుంట శ్రీనివాసులురెడ్డిని బాలినేని ఎన్నికల బరిలో దించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ భారీ విజయం సాధించింది. అదే విధంగా మాగుంట రెండు లక్షలకు పైగానే ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మంత్రివర్గంలో బాలినేనికి సముచిత స్థానాన్ని జగన్ కేటాయించారు. రెండున్నర సంవత్సరాల తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బాలినేనిని మంత్రివర్గం నుంచి తప్పించి యదావిధిగా ఆదిమూలపు సురేష్‌ను మంత్రిగా కొనసాగించారు.

### అధిష్టానంపై తీవ్ర మనస్తాపంతో

బాలినేని శ్రీనివాసరెడ్డికి మంత్రి స్థానం కల్పించకపోవడంతో అధిష్టానం పై తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అప్పట్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిలు బాలినేనిని బుజ్జగించడం జరిగింది. కాగా 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో తాను సూచించిన అభ్యర్థులు కాకుండా అధిష్టానం ఐ ప్యాక్ సూచించిన అభ్యర్థులకు టికెట్లను కేటాయించింది. ఆ ఎన్నికల్లో బాలినేనికి అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రధానంగా ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని నిలబెట్టాలని అధిష్టానంపై బాలినేనిని తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. కానీ పక్క జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పును చేయడం జరిగింది. ఈ అంశం ప్రతిపక్ష నేతలకు అస్త్రంగా మారింది. ఇక్కడ పనికిరాని చెత్త అక్కడ పనికొస్తుందా అంటూ అభ్యర్థులను ఉద్దేశించి అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తీరా ఫలితాల్లో ఘోరంగా పార్టీ పరాజయం పాలైంది. ఓట్ల కౌంటింగ్ జరుగుతున్న సమయంలోనే ఫలితాలు అనుకూలంగా రాకపోవడంతో బాలినేని హైదరాబాదు వెళ్ళిపోవడం జరిగింది.

### రసకందాయంలో కార్పోరేషన్

ఒంగోలు కార్పోరేషన్ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. కార్పోరేషన్ మేయర్‌తో పాటు మెజార్టీ కార్పోరేటర్లు టీడీపీ గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కొంత మంది కార్పోరేటర్లు హైదరాబాదులో ఉన్నా బాలినేనిని కలవడం జరిగింది. ఆ సమయంలో పార్టీ మార్పు అంశాలు తెరపైకి రావడంతో మీ ఇష్టం అంటూ ముక్త సరిగా సమాధానం ఇవ్వడం జరిగింది. ఒంగోలు కార్పోరేషన్ పరిధిలో మెజార్టీ కార్పోరేటర్లు వైసీపీకి ఉన్నారు. కానీ కార్పోరేటర్లను ఏకతాటి పై నిలిపి నేనున్నానంటూ బాలినేని భరోసా ఇచ్చిన పరిస్థితులు లేవని తెలుస్తోంది. దీంతో కార్పోరేటర్లు టీడీపీ గూటికి చేరేందుకే సిద్ధమయ్యారు. 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమిపాలైనప్పటికీ బాలినేని దృఢ సంకల్పంతో పార్టీని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేసేందుకు కంకణంకట్టుకున్నారు. కానీ అధిష్టాన నిర్ణయంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తాజాగా జిల్లా పార్టీ అధ్యక్షులుగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమిస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయన అభ్యర్థిత్వాన్ని బాలినేని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జిల్లాలోని నాయకులకే పార్టీ బాధ్యతలు అప్పగించాలని బాలినేని డిమాండ్ చేస్తున్నారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసీపీని వీడి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకుంటారా అన్న చర్చ వినిపిస్తోంది. జనసేనాని పవన్ కళ్యాణ్‌తో బాలినేనికి సత్సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాలినేని రాజకీయ పయనం పై జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది. ప్రధానంగా బాలినేనికి జిల్లా పరంగా బాధ్యతలు పూర్తిస్థాయిలో అప్పగించి ఉన్నట్లయితే పార్టీ ఘోరంగా పరాజయం పాలయ్యేది కాదన్న చర్చ వినిపిస్తోంది.

### అన్ని నియోజకవర్గాల్లోనూ....

అన్ని నియోజకవర్గాల్లోనూ వైసీపీలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కార్యకర్తలకు దూరంగా ఉంటూ నేతలు తిరుగుతున్నారు. దీంతో అసలు పార్టీలో ఉన్నారా, పార్టీ మారేందుకు పావులు కదుపుతున్నారా అన్న అనుమానాలు సైతం కార్యకర్తల్లో కనిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగితే వైసీపీకి జిల్లాలో భారీ దెబ్బ తగిలే అవకాశం ఉంది. చాలా చోట్ల సర్పంచ్‌లను, ఎంపిపిలను, మున్సిపల్ చైర్మన్‌లను, కార్పోరేషన్ చైర్మన్‌లను మార్చేందుకు కూటమి నేతలు కూడగట్టుకొని ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిని ఎదుర్కోనేందుకు వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఇప్పటికైనా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పై ప్రత్యేక దృష్టి పెట్టి పార్టీ బాధ్యతలను జిల్లాకు బలమైన సత్సబంధాలు ఉన్న నేతలను నియమించి పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి వర్గపోరుతో పార్టీని బలహీన పరుస్తారో, పార్టీని నడిపే నేతకు పగ్గాలు అప్పగించి పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తారో వేచి చూడాల్సిందే...!

---

# దివ్యాంగ బాలునికి శ్రవణ యంత్రం అందజేత

## జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 22)
సోమవారం గ్రీవెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగ బాలునికి శ్రవణ యంత్రమును ప్రకాశం జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా అందజేశారు.

---

4

# జనసేన నాయకులకు భీమా

## సదుపాయం గొప్ప వరం
## రూ.5 లక్షల భీమా చెక్కు అందజేసిన
## జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 22)

ప్రతి జన సైనికులకు వీర మహిళలలకు భరోసా కల్పించడమే ధ్యేయంగా జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నాయకులకు భీమా సదుపాయం కల్పించిన గొప్ప వరమనీ జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం శతకోడు గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యులు కొఠారి గాలయ్య ఎనిమిది నెలల క్రితం రైలు ప్రమాదంలో మృతి చెందారు. గాలెయ్య కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల భీమా చెక్కులను కుటుంబానికి అందేలా జనసేన (తరువాయి 4లో...)

---

# రాజ్ క్లినిక్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దాడి

## తగిన అనుమతులు లేక పోవడంతో క్లినిక్ సీజ్
## వరుస దాడులతో క్లినిక్ ల్యాబ్ నిర్వాహకులలో ఆందోళన



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జులై 22)

ప్రకాశం జిల్లా సింగరాయకొండ కేంద్రముగా పుట్టగొడుగుల్లాగా రోజురోజుకి గల్లీలు వారీగా జిల్లా వైద్యశాఖ అధికారుల అనుమతులు ప్రభుత్వ నియమ, నిబంధనలు ఎలాంటివి లేకుండా వారి ఇష్టానుసారంగా సింగరాయకొండ పట్టణంలోని పలుచోట్ల విచ్చలవిడిగా ఆర్ఎంపి డాక్టర్లు వారి సొంత ల్యాబ్లు ఏర్పాటు చేసుకొని ప్రజలను అడ్డాగా మార్చుకొని రోగుల పాలిట అందిన కాడికి దోసుకుంటున్నారని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో భాగంగా జిల్లా వైద్యాధికారులు ఇప్పటికే వరుసగా పలుచోట్ల దాడులు చేసి ఆర్ఎంపీ వైద్యులు నిర్వహించే ల్యాబ్లు క్లినిక్లు సీజ్ చేసిన విషయం మనందరికీ తెలిసిందే. అయినా మమ్మల్ని ఏమీ ఎవరూ చేయలేరు అంటూ ఆర్ఎంపీ డాక్టర్ల పలువురు ప్రభుత్వ అనుమతులు లేకుండా లేబర్లు నిర్వహించి వారి సొంత వ్యాపారంగా మార్చుకుంటూ పచ్చ నోట్లు కాగితాలు సంపాదన ధ్యేయంగా భావించి పలువురు నిలువు దోపిడి రోగుల వద్ద క్లినిక్ వైద్యం పేరుతో దోచుకోవడం పరిపాటైందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించినా లెక్క చేయకుండా అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్వహిస్తున్న ప్రయివేట్ క్లినిక్ ల్యాబ్‌లపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో సింగరాయకొండ రాజ్ క్లినిక్ ల్యాబ్‌ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. సోమవారం ఆమేరకు సింగరాయ కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ వంశీధర్ తన సిబ్బంది సింగరాయ కొండ గ్రామ పంచాయితీలో నిర్వహిస్తున్న క్లినికల్ ల్యాబ్‌ని తనిఖీ చేశారు. వైద్య అధికారులు తనిఖీ చేస్తున్న సమయంలో క్లినిక్ ల్యాబ్ నిర్వాహకుడు అనుమతి పత్రాలు, సరయిన రికార్డులు నిర్వహణ లేక పోవడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు తనిఖీ చేసి సరైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్ ల్యాబ్ ని సీజ్ చేసినట్లు డాక్టర్ వంశీధర్ పేర్కొన్నారు. ఈ దాడిలో సింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా వుండగా ఇటీవలనే పట్టాభివారి వీధిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్ ల్యాబ్ పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తమ బృందం తో దాడి చేసి (తరువాయి 4లో...)

---

## ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్‌గా

# బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి

## ఎదురేగి స్వాగతం పలికిన యూనివర్శిటీ ఉద్యోగులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఇన్చార్జి ఉప కులపతిగా నియమింపబడిన ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి సోమవారం సాయంత్రం యూనివర్శిటీ ప్రాంగణంలోని వి.సి.ఛాంబర్ నందు లాంఛనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు ఆధ్వర్యంలో యూనివర్శిటీ ఉద్యోగులు ప్రొఫెసర్ మూర్తికి ఎదురేగి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. యూనివర్శిటీ పరిధిలో అడ్మిషన్లు బాగా పెంచి స్థానిక విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన విద్యను అందించేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు,అధికారులతో కలిసి ముందుకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి అవసరమైన స్టాఫ్, భవనాలు, ఆర్థిక పరమైన వనరులు ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని ప్రొఫెసర్ మూర్తి కోరారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఆంధ్రా యూనివర్శిటీ కూడా ప్రారంభంలో అనేక ఇబ్బందులను ఎదుర్కోవడం జరిగిందని, ప్రస్తుతం సదరు యూనివర్శిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ రకాల కోర్సులు,సిబ్బందితో కళకాళలాడుతోందని అన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ని అన్ని రంగాలలో ముందుకు అభివృద్ధి పరిచేందుకు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుకు వెళ్ళడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతనంగా కోర్సులను ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, అందుకు అవసరమైన అధ్యాపకులను, సిబ్బందిని నియమించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నూతన ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి తన నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచి తనకి ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ తదితరులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు ఆద్వర్యంలో కళాశాల అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, డిగ్రీ, బి.ఎడ్ కళాశాలల యాజమాన్యాలు,పలువురు స్థానికులు వైస్ ఛాన్సలర్ మూర్తిని శాలువాలతో సన్మానించి, బొకేలను అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరి బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి రాజ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలా మణి, సిఈ డాక్టర్ కేవిఎన్ రాజు, ఏసిఈ డాక్టర్ బి పద్మజ, డీన్ సిడిసి డాక్టర్ డి వేంకటేశ్వరరెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ అంచుల భారతీదేవి, (తరువాయి 4లో...)

## దివ్యాంగ బాలునికి శ్రవణ యంత్రం అందజేత

మద్దిపాడు మండలం కీర్తిపాడుకు చెందిన మొండ్రు హరినాథ్ పద్మల కుమారుడు స్టీవెన్ (13)పుట్టుకతో వినపడని సమస్యతో బాధపడుతున్నాడు. ఈ సమస్య దైనందిన జీవితంతో పాటు విద్యాభ్యాసానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని స్టీవెన్ తల్లి పద్మావతి గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణకి విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన జాయింట్ కలెక్టర్ దరఖాస్తుదారునికి శ్రవణ యంత్రం మంజూరు చేయాల్సిం దిగా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ శాఖ సహాయ సంచాలకులు జి అర్చన ఆధ్వర్యంలో సిబ్బంది, శ్రవణ యంత్రమును సమకూర్చారు. ఈ శ్రవణ యంత్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా గ్రీవెన్స్ హాల్లో బాలునికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలుడు స్టీవెన్ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులకు భీమా



పార్టీ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కృషి చేశారనీ జనసేన పార్టీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జ్ మేకతోటి గౌతమ్ రాజ్ తెలిపారు. చెక్కు తీసుకొని కుటుంబ సభ్యులు జనసేనా పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి ఋణ పడి ఉంటామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పుల్లలచెరువు జనసేనా పార్టీ మండల అధ్యక్షులు కొఠారి అచ్చయ్య, వల్లెంట్రీ నామాల నాగేంద్ర బాబు, జనసైనికులు పాల్గొన్నారు.

## రాజ్ క్లినిక్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దాడి



ల్యాబ్ ని సీజ్ చేశారు. అంతేగాక సింగరాయకొండలో ప్రభుత్వ, వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు లేకుండా, అర్హత లేకుండా క్లినిక్ ల్యాబ్ లు నిర్వహణలో ఉన్న సమాచారం, ఫిర్యాదులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి పెట్టి దాడులు చేస్తున్నట్లు తెలుస్తుంది. వరుస దాడుల కారణంగా సింగరాయకొండ లో అనుమతులు అర్హతలు లేకుండా క్లినిక్ ల్యాబ్‌లు నిర్వహించే వారు ఆందోళన చెందుతున్నారు.

## ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి



సహా ఆచార్యులు డాక్టర్ ఎం జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ హర్ష ప్రీతం దేవ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ దేవి వరప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ జి సోమ శేఖర్, ఏసిటీఏ డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఫైనాన్స్ ఆఫీసర్ కే వి కృష్ణారావు, కాంట్రాక్టు అధ్యాపకులు, అతిథి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబుని కలిసిన జనసేన నాయకులు

(షణ్ముఖ వెలుగు, మంగళగిరి, జులై 22)



పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరి లో జాతీయ మీడియా ప్రతినిధి జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సమక్షం లో జనసేన జిల్లా నాయకులు గునుకులకి షేర్,వారిసతీమణి విజయలక్ష్మి జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కార్యాలయం ఇన్చార్జి జమీర్,శ్రీరామ్, గుర్రం కిషోర్,హరి,శేఖర్,కోల విజయలక్ష్మి,ప్రశాంత్ గౌడ్,మురళి నాగిశెట్టి వారి సతీమణి కుమార్తె ఈ రోజు ప్రధాన కార్యదర్శి నాగబాబును కలిశారు. జెండా పట్టి నడిచిన కార్యకర్తలు శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు ప్రారంభించబడిన క్రియాశీలక సభ్యత్వం మహాయజ్ఞం లా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. నిన్నటి రోజున క్రియాశీలకు సభ్యత్వం చేసుకొని దురదృష్టవశాత్తు కుటుంబ పెద్దలను కోల్పోయిన కుటుంబాలకు జనసేన పార్టీ తరఫున సాయంగా ఒక ఐదు లక్షల రూపాయలు ఇస్తుంటే వారి బాధ ని తీర్చలేక పోయినా ఈ సాయం వారికెంతో ఉపయోగ పడుతుందన్నారు. మనం చేసే ఈ ప్రయత్నం మన కార్యకర్తల కుటుంబాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అందరూ కష్టపడి సభ్యత్వం నమోదు చేయాలి. జిల్లాలో రెన్యువల్స్,కొత్త సభ్యత్వాలు ఎక్కువ సంఖ్యలో సాధించాలని తెలిపారు.

## అవసరం మేరకు క్లాప్ మిత్రలను నియమించండి

### ఎంపీడీఓను కోరిన గుత్తి త్యాగరాజు

(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 22)

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు ఇందిరానగర్ పంచాయతీ, మరియు అన్ని పంచాయతీలలో క్లాప్ మిత్ర(పారిశుద్ధ్య కార్మికులు) నియామకం చేపట్టాలని ఎంపీడీఓ ప్రసాద్‌కు కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ ఆధ్వర్యంలో గుత్తి త్యాగరాజు వినతి పత్రం సమర్పించారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ద పెట్టవలసిన అవసరం ఉన్నదిని భావిస్తున్నానని, ఇందుకోసం మండలంలోని అన్ని పంచాయతీలలో క్లాప్ మిత్రలను అవసరనిమిత్తం భర్తీ చేయాలని ఎంపీడీఓ ప్రసాద్ కు విన్నవించిన్నట్లు తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి,పెండింగ్ లో ఉన్న క్లాప్ మిత్రల నియామకం చేపట్టాలని, కొన్ని చోట్ల పారిశుధ్య కార్మికులు లేరని, వాహనాలు తుప్పు పట్టాయని,దీనిపై వెంటనే చర్యలు చెపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నట్టు గుత్తి త్యాగరాజు తెలిపారు. వారికి సకాలంలో జీతాలు అందించేందుకు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ప్రసాద్ ను కోరారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే తగు చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు.



## ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

### మార్కాపురం డీఎస్పీ బాల సుందరరావు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 22)

మండలంలోని ఆటో డ్రైవర్లకు స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం డీఎస్పీ బాలసుందరరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు యూనిఫామ్ను తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఆటోలో అను మానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 22)

మండలంలోని రాయవరంలో ఏళ్ల తరబడి స్థిర నివాసం లేక ఎంతో మంది అద్దె ఇండ్లలోనే జీవనం సాగిస్తున్నారు. వారు పక్కా ఇళ్లను నిర్మించుకునేందుకు పట్టాలను మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు వెంకట రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమానికి ఆయన రైతులతో కలిసి వచ్చి సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇచ్చారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నాం ఎన్నో ప్రభుత్వాలు మారాయి కానీ మా గోడు పట్టించుకున్న వారే లేరని ప్రజలు సబ్ కలెక్టర్‌తో వాపోయారు. అనంతరం రాహుల్ మీద మాట్లాడుతూ సమస్యను పరిష్కరించి తగిన న్యాయం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## మొక్కు తీర్చుకున్న చేజర్ల మండల టిడిపి అధ్యక్షుడు రావి లక్ష్మీ నర్సారెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

టిడిపి పార్టీ అధికారంలోకి వచ్చి ఆత్మకూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలిచి మంత్రిగా నియమితులైతే పెంచలకోన దేవస్థానం లక్ష్మీనరసింహస్వామి వద్దకు కాలినడకన వస్తానని చేజర్ల మండల టిడిపి అధ్యక్షులు రావి లక్ష్మీ నరసారెడ్డి మొక్కుకున్నారు. సోమవారం ఉదయం 4.30 నుంచి చేజర్లలోని రామాలయంలో పూజలు చేసి మొక్కు తీర్చుకోవడానికి కాలినడకన పెంచలకోనకు బయలుదేరారు వారి వెంట కుటుంబ సభ్యులు టిడిపి కార్యకర్తలు 30 మంది బయలుదేరారు. మార్గమధ్యలో ఆదురుపల్లిలో టిడిపి నాయకులు చీర్ల వెంకటేశ్వర్లు,పీర్ల వెంకటయ్య వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చేజర్ల మండల టిడిపి అధ్యక్షులు రావి లక్ష్మీ నరసరెడ్డి మాట్లాడుతూ తన మొక్కు తీర్చుకోవడానికి కాలినడకన పెంచలకోనకు బయలుదేరామని తెలిపారు. ఆదురుపల్లి సెంటర్ నుంచి గోవింద నామస్మరణలతో పెంచలకోనకు బయలుదేరారు.

## శ్రీరాంపురం నందు ప్రత్యేక ఆధార్ క్యాంప్

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 22)

మండల పరిధిలోని చాకిచర్ల గ్రామం శ్రీరామపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు మంగళవారం నుంచి జులై 27 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ విజయమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, ఆయా ప్రాంత ప్రజలుకు చాటింపు ద్వారా తెలియచేయాలని ఆదేశించారు. ఎవరైనా ఆధార్ కార్డు లేనివారు, ఆధార్ క్యాంప్ దగ్గరకు వెళ్ళి ఆధార్ నమోదుచేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# మోటార్ సైకిల్ పై రవాణా శాఖ ఇచ్చిన నెంబర్ ప్లేట్లు తప్పనిసరి

- నెంబర్ ప్లేట్ల పై ఏటువంటి గుర్తులు, పేర్లు వాడితే చట్టపరంగా చర్యలు తప్పవు

- సింగరాయకొండ సిఐ రంగనాథ్



(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, జులై 22)

మోటార్ సైకిల్ వాహన దారులు తమ తమ వాహనాల పై రవాణా శాఖ అధికారులు మంజూరు చేసిన నంబర్ ప్లేట్ మాత్రమే వాడుకోవాలని సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఆమేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ వాహనాలకు అనుమతి ఇచ్చిన నంబర్‌లు కన్పించే విధంగా ఉంచాలని నంబర్ ప్లేట్ల పై నంబర్ తప్ప మరే ఇతర పేర్లు, రాతలు ఉండకూడదని దానికి భిన్నంగా ఎవరయినా నంబర్ ప్లేట్ల పై రాతలు రాసినా ప్లేట్ కన్పించకుండా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని మోటార్ సైకిల్ పై ఇద్దరికి మించి ప్రయాణించరాదని త్రిబుల్ రైడింగ్ చేయడం నేరం అన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేయడం, సిలిన్సర్ మార్చి శబ్ద కాలుష్యానికి పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మోటార్ సైకిల్ నడపే వారందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలలో నిలపాలని సూచించారు. ట్రాఫిక్ గాని ప్రజల రాక పోకలకుగాని అంతరాయం కలిగించ రాదని ఎవరయినా ప్రజలకు ఇబ్బంది కలుగ చేస్తే క్రిమినల్ చర్యలకు గురవుతారని సిఐ హెచ్చరించారు. వ్యాపారస్తులందరూ తమ షాపులు ముందు రోడ్డుమీద పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు సేవించే వారి గురించి గాని, మాదకద్రవ్యాల అమ్మే వారి గురించి గాని, పేకాట, కోడి పందాలు, బెట్టింగ్ రాయుళ్ల గురించి గాని సమాచారం తెలిస్తే ఈ క్రింది నెంబర్ కి సమాచారం తెలిపి వాటికి అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సింగరాయకొండ సీఐ, ఎస్సై ల ఫోన్ నెంబర్లు 9121102135, 9121102136 లకు సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు.

సైబర్ నేరాల గురించి అప్రమత్తంగా ఉండి ఫోన్ లో వచ్చే ఓటిపిలు గానీ ఏదైనా లింక్స్ వస్తే ఓపెన్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఇతరులకు చెప్పకూడదని అలా ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.

## వాహనాలపై విచిత్రమైన స్టిక్కరింగ్, నంబర్ ప్లేట్లు వేస్తే ఉపేక్షించేది లేదు

**వాహనదారులను హెచ్చరించిన ఎస్ఐ జి కోటయ్య**

**పలు వాహనాలపై స్టిక్కరింగ్‌లు తొలగింపు**





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 22)

పొదిలి-మార్కాపురం అడ్డరోడ్‌లో వాహనాల నెంబర్ ప్లేట్లపై విచిత్రమైన స్టిక్కరింగ్‌లను సోమవారం ఎస్ఐ జి కోటయ్య స్వయంగా తొలగించారు. అనంతరం వాహనాలు తనిఖీచేసి రోడ్డు ప్రమాదాలపై విశ్వనాధపురం సెంటర్లోని ఆటోస్టాండ్‌లో డ్రైవర్లకి అవగాహన కల్పించారు. ఆటోలో పరిమితికి మించి ఎవరైనా ఎక్కువ మంది ప్రయాణం చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 199 నంబర్ రైల్వే క్రాసింగ్ వద్ద ఆర్వో బ్రిడ్జి నిర్మాణ ప్రదేశంపై కలెక్టర్ ఆరా!





(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, జులై 22)

ఎంతో కాలంగా ఇబ్బంది పెడుతున్న ప్రజలకు రోడ్డు కం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కల ఫలించే రోజులు దగ్గర పడ్డాయి. కారుమంచి కొత్తపట్నం రోడ్డు కాలానికి మోక్షం కలుగనున్నది. నెల్లూరు ప్రకాశం జిల్లాల ప్రజలు, వాహన దారులు, రోడ్డు రవాణా మార్గానికి ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అవసరాన్ని గుర్తించి ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎ. తమీం అన్సారియ సోమవారం సూరారెడ్డిపాలెం 199 రైల్వే క్రాసింగ్ వద్ద ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత రోడ్లు భవనాలు శాఖ అధికారులతో సమీక్షించారు. దీనికి సంబంధించి బ్రిడ్జి నిర్మాణం అంచనాలు, ప్లాన్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ సమీక్షలో ఆర్అండ్‌బి ఎస్ఈ దేవదానం, ఈఈ గోపి నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయం హెల్త్ సెక్రెటరీని పరామర్శించిన కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 22)

విధినిర్వహణలో భాగంగా కనిగిరి మున్సిపాలిటీ కమిషనర్ ఆదేశాలు మేరకు ప్రతిరోజూ ఉదయం 7గంటలకు ఫీల్డ్ మీద కి వెళ్ళి ఫోటోలు పంపమని సచివాలయ సిబ్బందికి తెలియజేయగా ఏడవ సచివాలయంలో హెల్త్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మి విధులకు వెళ్తుండగా దేవాంగ నగర్ ప్రాంతంలో స్కూటీ మీద వెళుతూ ప్రమాదవశాత్తు పడి కాలు విరిగి ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ప్రమాదవశాత్తు విషయము తెలియగానే హుటా హుటిగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ప్రమాదవశాత్తు గురైన హెల్త్ సెక్రెటరీ దగ్గరికి వెళ్లి ఆరోగ్య విషయాలు తెలుసుకుని పరామర్శించారు. అనంతరం వైద్య అధికారులతో మాట్లాడి ప్రమాదవశాత్తుతో గురైన హెల్త్ సెక్రెటరీకి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌కు సూచించారు.

# సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

**నేర నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి**





(షణ్ముఖ వెలుగు, సంతనూతలపాడు, జులై 22)

పోలీస్ స్టేషన్ లకు వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి, సమస్య తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ సూచించారు. పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. మొదటగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసులకు సంబంధించిన వాహనాలను పరిశీలించి, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలు, శాంతిభద్రతలు, అసాంఘిక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని, రికార్డుల నిర్వహణ విషయంలో, విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా సిబ్బంది విధులు నిర్వర్తించాలని, విజిబుల్ పోలీసింగ్ విధిగా నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడవద్దని తెలియజేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, వారి యొక్క సమస్య తెలుసుకొని వెంటనే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట సంతనూతలపాడు ఎస్ఐ యం దేవకుమార్, సిబ్బంది ఉన్నారు.

# ఆర్టీవో ఇచ్చిన నంబర్ ప్లేట్స్ వాడాలి

**మరే ఇతర నంబర్ ప్లేట్స్ వాడకూడదు**

**వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అలీ సాహెబ్ సూచన**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)




మీ యొక్క మోటార్ సైకిల్, ఆటో, కార్ల మీద ఆర్టీవో ఇచ్చిన నంబర్ ప్లేట్ తప్ప మరి ఏ ఇతర నంబర్ ప్లేట్స్ వాడకూడదు. నంబర్ ప్లేట్స్, కనపడకుండా ఎలాంటి గుర్తులు గాని, చిహ్నాలు గాని ఇతరుల తాలుకా అని రాయకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదన్నారు. మోటార్ సైకిల్ మీద ఇద్దరకు మించి ప్రయాణించకూడదు, రాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. మోటార్ సైకిల్ నడుపు వారందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించవలెనన్నారు. వాహనాలు అన్ని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పెట్టుకోవాలన్నారు. వ్యాపారస్తులు తమ షాప్‌ల ముందు, రోడ్ మీద పార్కింగ్ చేపించకూడదన్నారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడిపందాలు గురించి సమాచారం తెలిసిన యెడల ఈ క్రింది నంబర్‌లకు తెలిపాలన్నారు. సైబర్ నేరాల గురించి అప్రమత్తంగా ఉండి ఫోన్‌లలో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయకూడదు, ఇతరులకు చెప్పకూడదన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1930. కొంత మంది ఉద్యోగాలు ఇప్పిస్తామని కొన్ని ఆఫిసుల్లో తెలిసిన వారున్నారని డబ్బులు తీసుకొని మోసం చేస్తున్నారు అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. కొన్ని ఫేక్ లోన్ యాప్ ఆన్‌లైన్ ద్వారా లోన్లు ఇచ్చి తర్వాత లోన్ కట్టకుంటే మీయొక్క వీడియోస్,ఫొటోలు, పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తారు. అందుకని ఆర్‌బీఐ అప్రూవల్ లేని యాప్స్‌లోకి వెళ్లి లోన్స్ తీసుకోరాదన్నారు. కొంత మంది ఇనుప కోట్ల వారు ట్రాన్స్ఫర్ లు పగలకొట్టి తెచ్చిన కాపర్ వైర్ కొంటున్నారు. వారి మీద కూడా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుంది. అలాంటి వారు ఎవరైనా వస్తే పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలన్నారు. కొంత మంది బంగారు వ్యాపారస్తులు గుర్తు తెలియని వాళ్ళ వద్ద నుంచి ఎటువంటి ఆధార్ కార్డులు కానీ ఫోన్ నంబర్స్ తీసుకోకుండా బంగారం కొంటున్నారు. అది దొంగ సొమ్ము అని తేలితే అటువంటి వారి మీద కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే పరమావధి

**జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

**సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం**

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 92 ఫిర్యాదులు**





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 22)

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కారించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక"(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఫిర్యాదిదారుల యొక్క రాతపూర్వక వినతులను ఎస్పీ స్వీకరించి వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి ఫిర్యాదుల పూర్వాపరాలు అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. అందిన ఆయా ఫిర్యాదులపై ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ఆ ఫిర్యాదులపై తక్షణ విచారణ చేపట్టి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోని బాధితులకు న్యాయం అందించాలని, ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా నిర్ణీత గడువులో పరిష్కారించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూ, ఆర్థిక తగాదాలు, కుటుంబ సమస్యలు, అత్తరింటి వేదింపులు, జాబ్ మోసాలు మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్.వి శ్రీధర్ రావు, ప్యానెల్ అడ్వొకేట్ బివి.శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఒంగోలు నగరపాలక సంస్థలో ప్రమాద తీవ్రతను తగ్గించు నిమిత్తం తగు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరపాలక సంస్థకు చెందిన ఇంజనీరింగ్ , శానిటేషన్, సిబ్బందితో నగరంలోని ప్రధాన డ్రైనేజి, మురికినీటి కాలువలను యుద్ధప్రాతిపదికన పరిశీలించిన మీదట వాన నీరు ఎటువంటి అవరోధము లేకుండా పోతురాజు కాలువలో కలుపుటకు గాను తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంతేగాక నగరంలోని భారీ వర్షాల సందర్భముగా ఏవైనా అవాంతరాలు తలెత్తిన యెడల వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకొనవలసినదిగా కోరుచూ ఆయా సచివాలయాల పరిధిలోని అందరు సిబ్బందికి తెలియజేయుటతోపాటు నగర పాలక సంస్థ నందు టోల్ ఫ్రీ నెంబరు: 18004252858 ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 24,7 పద్ధతిపై సిబ్బందిని నియమించి ప్రజల నుంచి వచ్చే సమస్యలు, సూచనలను స్వీకరించు వాటిని వెంటనే పరిష్కరించుటకు తగు ఏర్పాట్లు చేపట్టారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని అందరు ప్రజలకు తెలియజేయునది ఏమనగా భారీ వర్షాల సందర్భముగా ఏదైనా అవాంతరాలు తలెత్తిన యెడల నగర పాలక సంస్థ కార్యాలయములోని టోల్ ఫ్రీ నెంబర్ 18004252858 నకు ఫోన్ కాల్ ద్వారా గాని లేదా ఆయా సచివాలయాల పరిధిలోని వార్డు సెక్రటరీలు యొక్క దృష్టికి తమ యొక్క సమస్యను తెలియజేస్తూ తగు రీతిన పరిష్కారం పొందవలసినదిగా తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించాలి

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 22)

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీకోసం)లో అందిన అర్జీలకు నాణ్యతతో కూడిన సత్వర పరిష్కారాన్ని అందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మీకోసం సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తోపాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, డిఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్‌డిసీలు వర కుమార్, ఝాన్సీలక్ష్మిలు హాజరై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ధరఖాస్తులను నాణ్యతతోపాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నాణ్యతతో వాటి పరిష్కారానికి సంబంధించిన అర్జీని వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తెలిపారు. న్యాయ సంబంధమైన సమస్యల అర్జీలను పరిష్కరించడంలో అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఒక బాలునికి శ్రావణ యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలి

## నగరపాలక సంస్థ కమీషనర్ జస్వంత్ కుమార్ కమీషనర్ సమీక్ష



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ జస్వంత్ కుమార్ కమీషనర్ ఛాంబర్‌లో కాలానుగుణ వ్యాధులు, స్టాఫ్ డయేరియా, పారిశుధ్య పనులపై అసిస్టెంట్ కమీషనర్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. వర్షా కాలంను దృష్టిలో పెట్టుకుని నగరంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు, కాలువల్లో సిల్ట్ తొలిగించుట ప్రతి రోజు తూచా తప్పకుండా నిర్వహించవలెనని శానిటేషన్ సెక్షన్ అధికారులను, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలను ఆదేశించారు. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు సంబంధిత సచివాలయాల పరిధిలో పారిశుధ్య పనులు పర్యవేక్షించాలి, ప్రతి రోజు మునిసిపల్ వర్కర్లు రోడ్లు శుభ్రము చేయుట, కాలువలలో సిల్టు తొలిగించుట లాంటి పనులను పర్యవేక్షించాలి, ఎక్కడైనా రోడ్లు శుభ్రముగా లేకపోవుట, కాలువలలో సిల్టు తొలిగించుట లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన యడల సంబంధిత శానిటేషన్ అధికారుల పై క్రమశిక్షణ చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. వర్షా కాలములో వచ్చు కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా డ్రై డే ప్రతి రోజూ పాటించాలి, లోతట్టు ప్రాంతాలలో మురుగు నీరు నిలువ ఉన్న దగ్గర ఆయిల్ బాల్స్ వేయడం, ఆంటీ లార్వల్ ఆపరేషన్స్ చేయడం, ఫాగింగ్ చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని తెలియచేసారు. కాలువలలో సిల్టులు తీసిన దగ్గర , చెత్త తీసి తడిగా ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్, సున్నం కలిపి చల్లాలని తెలిపారు. పైప్ లీకేజీలు ఉన్న యడల సంబంధిత ఏ.ఈ కి సమాచారం ఇవ్వాలని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలకు తెలిపారు. కాలానుగుణ వ్యాధులైన డయేరియా, డెంగీ ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు నగర ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నగర ప్రజలు ఇంటి కిటికీలు మూసుకోవడం, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిలవకుండా చూసుకోవడం ద్వారా ఈ కాలానుగుణ వ్యాధుల బారిన పడకుండా ఉండగలరని కమీషనర్ నగర ప్రజలకు తెలిపారు.

# ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## అవినీతిని అరికట్టాలని ధర్నా

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 22)





ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హనుమంతునిపాడు ఎండిఓ కార్యాలయం ఎదుట ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలని అవినీతిని అరికట్టాలని కోరుతూ ఉపాధి కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో కూలీలకు 8 వారాల వరకు పెండింగ్ బిల్లులు చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు గత రెండు నెలల నుంచి ఉపాధి పనులు ఆగిపోయాయని, కూలీలు పని లేక చేసిన పనికి డబ్బులు రాక కుటుంబాలు నడుపుకోవడం ఇబ్బందిగా మారిందని అప్పులు కూడా పుట్టినటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తపరిచారు కూరగాయలు నిత్యవసర వస్తువులు చిల్లర కుట్లలో కూలీలకు ఇవ్వటం లేదన్నారు పనిచేసిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వకపోవడం వలన కుటుంబ నిర్వహణకు వడ్డీలకు తెచ్చుకోవచ్చని పరిస్థితి వచ్చింది అన్నారు. వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని కూలీలను పనికిరాకుండా చేసేందుకు రెండు పూటలా ఫోటోలు, మస్టర్లు పని ప్రదేశంలో వేయాల్సి వస్తుందని మాస్టర్ సీట్లో కుటుంబం ఇంటిపేరు తెలుగులో ఉండదని కూలీలందరికీ గ్రూపు రద్దుచేసి వర్క్ ఐడి ఆధారంగా హాజరు వేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు సమ్మర్ అలవెన్స్ మజ్జిగ మంచినీళ్లు పలుగు పారా తట్ట లకు ఇచ్చే వారితోష్కం ఇవ్వడం లేదని మేట్ వ్యవస్థను రద్దు చేశారని ఐదేళ్లుగా పనిముట్లు ఇవ్వటం లేదని, ఇది కేంద్ర ప్రభుత్వ కుట్రని విమర్శించారు. తక్షణమే ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించి ప్రతి జాబ్ కార్డుదారుడికి 200 రోజులు పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ పత్రాన్ని ఎండిఓకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి కూలీలు గురునాథం, రాములు, గురు స్వామి, లక్కు చిన్న వెంకటేశ్వర్లు, ఆంధ్రి గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల మేరకే నెంబర్ ప్లేట్లు వాడాలి

## సిఐ ఆవుల వెంకటేశ్వర్లు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం మున్సిపాల్టీ, జులై 22)

మీ యొక్క మోటార్ సైకిల్, ఆటో, కార్‌ల మీద అర్‌టిఓ ఇచ్చిన నంబర్ ప్లేట్ తప్ప మరి ఏ ఇతర నంబర్ ప్లేట్స్ వాడకూడదని మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో ప్రజలకు తెలిపారు. నంబర్ ప్లేట్స్ కనపడకుండా ఎలాంటి గుర్తులు గాని, చిహ్నాలు గాని ఇతరుల తాలుకా అని రాయకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మోటార్ సైకిల్ మీద ఇద్దరకు మించి ప్రయాణించకూడదని, రాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. మోటార్ సైకిల్ నడుపు వారందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు అన్ని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పెట్టుకోవాలన్నారు. వ్యాపారస్తులు తమ షాప్‌ల ముందు, రోడ్ మీద పార్కింగ్ చేపించకూడదన్నారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడిపందాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే మార్కాపురం టౌన్ ఎస్ఐ 9121102182 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వీటితో పాటు సైబర్ నేరాల గురించి అప్రమత్తంగా ఉండి ఫోన్‌లలో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయకూడదన్నారు. ఓటీపీలు ఇతరులకు చెప్పకూడదన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1930. కొంత మంది ఉద్యోగాలు ఇప్పిస్తామని కొన్ని ఆఫీసుల్లో తెలిసిన వారున్నారని డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారి వివరాలు తెలియజేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు పెట్టుకోవాలి

## బంగారం షాపు యజమానులకు పొదిలి ఎస్ఐ సూచన



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 22)

జిల్లా ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు మేరకు పొదిలి పట్టణంలోని బంగారు షాపు ఓనర్లకు ఎస్ఐ జి కోటయ్య సోమవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో పలు సూచనలు చేశారు. ప్రతి షాపుల నందు ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు పెట్టుకుంటూ వారి షాపు ముందు కూడా ఒక కెమెరా ఉండేలాగా చూడాలన్నారు. అదే విధంగా ఎవరైనా అనుమానిత వ్యక్తుల యొక్క కదలికల గురించిన సమాచారం ఉంటే అట్టి సమాచారాన్ని వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని ఈ సందర్భంగా వారికి సూచించారు.

# కోపరేటివ్ సొసైటీ బిల్డింగ్ ఆక్రమణను అడ్డుకోండి

## - ప్రజా సమస్యల ప్రజావేదికలో ఫిర్యాదు
## - సత్వరమే పరిష్కరించాలంటూ బిజెపి నాయకుల డిమాండ్



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జులై 22)

మండలంలోని మాముడూరు గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిషన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య నాయుడు జిల్లా ఉపాధ్యక్షులు అల్లంపాటి నారాయణరెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామ కోపరేటివ్ సొసైటీ బిల్డింగ్ పై అర్జీ ఇవ్వడం జరిగింది. అనంతరం వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఆ గ్రామానికి చెందిన కో-ఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన బిల్డింగ్ గత 50 సంవత్సరాల క్రితం నిర్మించ బడినది.సదరు స్థలమును గ్రామస్తులు కొంతమంది స్థల రిజిస్ట్రేషన్ కూడా కో-ఆపరేటివ్ సొసైటీ వారికి రిజిస్టర్ చేసి ఉన్నారు.ఆ స్థలంలో బిల్డింగు రైతులు ధాన్యము నిలువ ఉంచుకొనుటకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి అనే అతను తన పలుకుబడిని ఉపయోగించి సుమారు పది లక్షలకు వరకు సొసైటీలో డ్రా చేసి సదరు బిల్డింగును పగలగొట్టినాడు. ప్రభుత్వం నుండి అనుమతులు లేనందున సదరు బిల్డింగును పగలగొట్టవలసిన వాస్తవంగా అవసరం లేదు. అందులో ఉన్న విలువైన దరతులు టేకు ద్వార బంధములు అమ్ముకుని సదరు బిల్డింగును పగలగొట్టినప్పుడు ఎలాంటి ఎస్టిమేషన్లు లేకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడి అప్పటి సీఈవో అధికారి సహకారంతో దుర్వినియోగం జరిగింది. ఆ స్థలము పారిజాత చారిటబుల్ ట్రస్ట్ కి బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి అక్రమ పద్ధతిలో కట్టబెట్టి ఆ స్థలమును కబ్జా చేసి నాదేనని షాపింగ్ కాంప్లెక్స్ కట్టాలని ప్రయత్నం చేయుచున్నాడంటూ అందువలన తమరు గ్రామస్తులుగా మేము ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్వపరాలు విచారణ చేసి తక్షణమే అన్యాక్రాంతమైన స్థలమును వైసీపీ నాయకుడు బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి దగ్గర నుండి రికవరీ చేసి ఆ స్థలంకు హద్దులు ఏర్పాటు చేసి మా గ్రామానికి న్యాయం చేయాలని గ్రామస్తులుగా మేము ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహశీల్దారుకి ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

# రహదారుల పై పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

## కలెక్టర్ తమీమ్ అన్సారియా





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 22)

ఒంగోలు-కొత్తపట్నం రహదారిలోని బకింగ్ హాం కెనాల్‌పై నిర్మించిన బ్రిడ్జిని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, రహదారులు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణం ఎస్టిమేషన్స్, చేపట్టిన పనులు తదితర వివరాలను ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో వున్న బ్రిడ్జి సేఫ్టీ వాల్, తదితర పనులను త్వరితగతిన పూర్తీ చేయాలని జిల్లా కలెక్టర్, ఆర్. అండ్ బి అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తపట్నం మండల కేంద్రంలో చేపట్టి అసంపూర్తిగా వున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను, డివైడర్ పనులను త్వరగా పూర్తీ చేయాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బి ఎస్ఈ దేవానందం, ఈఈ గోపి నాయక్, తహసిల్దార్ హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతికోసం సంఘ కాపరులు ప్రార్ధనలు చేయాలి

## ఒంగోలు షకీనా ప్రార్ధన మందిరంలో సంఘ కాపరులు సమావేశం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

దేశంలో, రాష్ట్రంలో శాంతి విరా జి ల్లాలని,శాంతి సామరస్యాలతో ప్రజలందరూ సుఖంగా ఉండాలని కోరుతూ ప్రతి క్రైస్తవుడు ప్రార్ధన చేయాలని ఒంగోలు టౌన్ డినామినేషన్ చర్చస్ యూనియన్ప్రసిడెంట్ పాస్టర్ ఐజాక్ బాబు, సెక్రటరీ పాస్టర్ భగవాన్ దాస్ పిలుపునిచ్చారు. ఒంగోలు సుజాతనగర్‌లోని షకేను ప్రార్ధన మందిరంలో నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి 150 మంది దాకా సంఘ కాపరులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో టౌన్ డినామినేషన్ చర్చెస్ యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని ప్రతి ఒక్కరికి అందించేలా ప్రతి సంఘ కాపరి కృషి చేయాలని పేర్కొన్నారు. నెలవారీ జరిగే యూనియన్ సమావేశాలలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలని సంఘ కాపరులకు సూచించారు. సంఘ పెద్దలు యోబు, జకర్యా, కృపారావు, డేవిడ్, శ్రీనివాసరావు, రమణ,రవికుమార్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పతకాలు సాధించిన సిబ్బందికి ఎస్పీ అభినందన

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 22)




జూన్ 24 నుండి 30 వరకు అస్సాంలో జరిగిన 9వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2024 జాతీయస్థాయి పోటీలలో ఏపీ పోలీస్ శాఖ నుంచి ప్రాతినిధ్యం వహించి పెనాక్ శిలాత్ పోటీలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా ఎస్పీ సోమవారం ఆయన ఛాంబర్‌లో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. బంగారం పతాకం, కె.చరణ్ తేజ, సిల్వర్ మెడల్ - యం.రాజశేఖర్, తైక్వాండోలో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్న కె.అరుణ్ కుమార్ , పెంచాక్ సిలాత్, కరాటే పోటీల్లో కాంస్య పతాకలు పొందిన పి.కల్పన, కరాటే పోటీలలో కాంస్యం పతాకం సాధించిన ఏ.శ్రావణి, కరాటే పోటీలలో కాంస్యం పతాకం సాధించిన టి.పావని, కరాటే పోటీలలో కాంస్యం పతాకం సాధించిన వి. ప్రియాంక, తైక్వాండో పోటీలలో కాంస్యం పతకం సాధించిన యస్. ఫరహతుల్లాలను ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. (మొత్తం 9 ఇందులో బంగారు పతకం-1, రజిత పతకాలు 2, కాంస్య పతకాలు 6 సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ స్థాయి జరిగిన పోటీల కోసం ఒంగోలులోని పోలీస్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ (డిటిసి) నందు అద్భుతంగా శిక్షణ పొంది తైక్వాండో, కరాటే, పెంచాక్ సిలాత్ క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన చేసి పతకాలు సాధించారని, ఓ వైపు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే మరోవైపు క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో నిరంతర సాధన చేస్తూ జాతీయస్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమని ప్రసంశించారు. రాష్ట్రం నుండి జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం రాష్ట్ర పోలీస్ శాఖకు గర్వకారణమన్నారు. అలాగే భవిష్యత్తు లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు పాల్గొన్నారు.

# దివ్యాంగులను అవమానించిన ఐఏఎస్ అధికారి క్షమాపణ చెప్పాలి

## వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల డిమాండ్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 22)

దివ్యాంగులను అవమానించిన ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ దివ్యాంగుల సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. దివ్యాంగులు అంటే గౌరవం ఉంది అంటూనే దివ్యాంగుల సమాజం అంటే హేళనగా ట్విట్టర్లో అన్న ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ చేసిన కామెంట్స్ దివ్యాంగుల సమాజాన్ని కించపరిచేలా ఉందని, ఆమె వెంటనే దివ్యాంగుల సమాజానికి బహిరంగ క్షమాపణ చెబుతూ లేక విడుదల చేయాలని లేని పక్షంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని దివ్యాంగుల హక్కుల వేదిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీగిరిలో భక్తి శ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో కొలువు తీరిన ఉత్సవమూర్తులకు భక్తులు భక్త్యంజలులు సమర్పించారు. ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు రామాయణం, భగవద్గీత, భాగవతం వంటి పవిత్ర గ్రంథాలు. కావ్యాలలోని పద్యాలను శ్లోకాలను గానం చేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా ఈ నెల 28 వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీవారికి సువర్ణ అష్టదళ పద్మ పాదార్చన జరుగుతుందని పాల్గొనదలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## పవన్ కళ్యాణ్‌కు జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

పవన్ కళ్యాణ్‌కు ముప్పు వాటిల్లుతుందని కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల పై ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆశాజ్యోతిగా, కాపులను ఏకతాటిపైకి తెచ్చి ఐక్యతతో ఏకపక్షంగా నిలిపిన, జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ముప్పు ఉందన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలపై ఆయనకు మద్దతు తెలిపారు. ప్రతి ఒక్క జనసైనికులు, వీరమహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అలాగే 1988వ సంవత్సరంలో రంగాని పోగొట్టుకున్నాం. ఇప్పుడు మరలా అలాంటి చరిష్మా కలిగిన నాయకుడు రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించి, తమ నాయకుడికి ఎలాంటి హానీ జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి మరి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తంజావూరు శ్రీనివాసమూర్తి, ముత్యాల నాగేశ్వరరావు, బూదే రామ్ రాజ్ కుమార్, శ్రీపతి సుబ్బయ్య, రావెళ్ళ వెంకట్రావు, పోకల రాంబాబు, శనగల కిరణ్, మల్లెల చెన్నకేశవులు, చెన్నంశెట్టి శివ, తాటి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవనాలను పరిశీలించిన ఎంపీడీవో తోట చందన





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 22)

తర్లుపాడు మండలంలోని గానుగపెంట, తుమ్మలచెరువు,తాడివారిపల్లె గ్రామాల్లో పర్యటించి అంగన్వాడీ సెంటర్, స్కూల్, ఇతర ప్రభుత్వ భవనాలు, ఇళ్లలో పారిశుధ్య సౌకర్యాలు,మరుగుదొడ్ల సౌకర్యాలను మార్కాపురం ఎంపీడీవో తోట చందన సోమవారం పరిశీలించారు. తర్లుపాడులో ఓ డి ఎఫ్ గ్రామ పరిశీలనకు ధృవీకరణ అధికారిగా ఎంపీడీవో చందనను నియమించారు. కార్యక్రమంలో ఏపీఎం మార్కాపురం రమేష్ బాబు, మండల సమన్వయకర్త శేషాద్రి నాయుడు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గురువులు త్రిమూర్తి స్వరూపులు శాస్త్రోక్తంగా గురువులకు పాదపూజ









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

గురువులు త్రిమూర్తి స్వరూపులని సంస్కార భారతి ప్రకాశం జిల్లా శాఖ ప్రముఖ్ పత్తి రంగమన్నార్ అన్నారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని కేశవస్వామిపేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి వారి దేవస్థానం కల్యాణ మండపంలో నటరాజ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా పలువురు గురువులను ఘనంగా సత్కరించారు. నాటకరంగ గురువు కళా ప్రకాశం అధ్యక్షులు చిట్టా వేంకట శివప్రసాద్, సాహిత్య గురువు ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, కూచిపూడి నృత్య గురువు నళినీ ప్రియ కూచిపూడి నృత్య కళానికేతన్ అధ్యక్షురాలు ఎస్.వి. శివకుమారి, సంగీత గురువు స్వరరాగ సుధ వ్యవస్థాపక కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసమూర్తి, భగవద్గీత శిక్షణ గురువు చేవూరి విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించి పాద పూజా కార్యక్రమాన్ని జరిపించారు. నేటితరానికి గురువు ప్రాధాన్యతను తెలియ చెప్పాలనే ఉద్దేశంతో సంస్కార భారతి విశిష్టమైన, ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలను నిర్వహిస్తూ మన సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుందని పత్తి రంగమన్నార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్.ఎస్.ఎస్.జిల్లా ప్రముఖ్ చంద్రశేఖర్ డా. ప్రసాద్, రిటైర్డ్ లెక్చరర్ చిరంజీవి, కోటీస్ మాల్ అధినేత నల్లమల్ల కోటి సూర్యనారాయణ, సంస్కార భారతి నిర్వాహకులు ఘోరకవి సంపత్ కుమార్, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా నటరాజస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకా రులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, శాస్త్రీయ సంగీత విభావరి అలరించింది.

# బొజ్జల గెలుపు కోసం వెంకన్న సన్నిధికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకున్న కాసరం





(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 22)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తీసుకుపోవడంలో రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్న తరుణంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడు పై కక్ష కట్టి స్కిల్ డెవలప్మెంట్ స్కాంలో అవినీతి జరిగిందని గత ఏడాది 2023, సెప్టెంబర్ 9వ తారీకున, కక్ష కట్టి అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు చంద్రబాబు ని పంపించడం అందరికీ విధితమే. ఆ సందర్భంలో శ్రీకాళహస్తి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద శాంతియుత వాతావరణంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి నేను నిరసన తెలియజేయడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనల నేపథ్యంలో అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రోద్బలంతో నన్ను ఏ2గా తనతో పాటు 8 మంది పై ఉద్దేశపూర్వకంగా మా గొంతుకను అణచివేత దిశగా అప్పటి 2వ పట్టణ పోలీసుల పై దాడి చేసామంటూ తప్పుడు కేసులు పెట్టి, రాత్రికి రాత్రే మమ్మల్ని అరెస్టు చేసి శ్రీకాళహస్తి సబ్ జైల్‌కు తరలించడం జరిగిందన్నారు. 13 రోజుల తర్వాత అత్యున్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఆ దినం అక్రమ కేసులు భనాయించిన నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం గద్దె దిగాలని బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలని ఆరోజు కలియుగ వెంకటేశ్వర స్వామిని కోరుకుంటూ మొక్కుకోవడం జరిగింది. అందులో భాగంగా సుమారు 1సం కాలం తర్వాత వైసీపీ ప్రభుత్వానికి చరిత్రలో మర్చిపోలేని విధంగా ప్రజలు తీర్పు ఇవ్వడం అందులో భాగంగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, ఇక్కడ బొజ్జల సుధీర్ రెడ్డి ఎమ్మెల్యేగా అత్యధిక మేజారిటీతో గెలవడం జరిగింది. పాదయాత్రగా కుటుంబ సభ్యులతో కలసి కలియుగ వెంకటేశ్వర స్వామి వద్దకు వెళ్లి తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకోవడం జరిగిందన్నారు.

# ఎడ్ల మల్లయ్య వైసీపీ ముఠాను అరెస్టు చేయాలి

### దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్




(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, జులై 22)

తాళ్లూరు మండలం చింతలపాలెంలో దళిత, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల్లో పంట ధ్వంసం చేసిన, ఎడ్ల మల్లయ్య వైసీపీ ముఠాను అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు చింతలపాలెం బాధిత దళిత గిరిజనుల నిరసన కార్యక్రమంలో నాగేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ పెద్దల కాలం నుంచి చింతలపాలెంకు చెందిన మాల మాదిగ ఎరుకల కులస్తులు ఉమ్మడి గడ్డ, పోరంబోకు భూముల్లో పంటలు పండించు కుంటున్నారన్నారు. దళిత గిరిజనులు శ్రమని, డబ్బుని వెచ్చించి చేలల్లో రాయి రప్ప ఏరి, భూముల్ని సాగుకు అను కూలం చేయడంతో, ఆ భూములపై గ్రామంలోని కమ్మ, రెడ్డి రైతుల కన్ను పడిందన్నారు. 2021లో దళిత గిరిజనులపై దాడి చేసిన కమ్మ కులస్తులను ఎస్సీ ఎస్టీ కేసులో అరెస్టు చేయించానన్నారు. క్రైమ్ నెంబర్ 155/21 కేసులో అరెస్టులు జరిగాక, కొందరు రైతులు ఈ భూములకు దూరంగా ఉన్నారన్నారు. అయితే వైసీపీ నాయకుడు ఎడ్ల మల్లయ్య వెలుగు వారి పాలెం విఆర్‌ఓ రమణారెడ్డి అండతో, ఉమ్మడి గడ్డ భూముల్ని సొంతం చేసుకోవాలనే దురుద్దేశంతో ఈనెల 14న, చేలోకి అక్రమంగా ప్రవేశించి సజ్జ పంటను దౌర్జన్యంగా ధ్వంసం చేశాడన్నారు. 20 మంది ఎస్సీ ఎస్టీ రైతులు 16 ఎకరాల్లో సాగుచేసిన సజ్జ పైరు ధ్వంసం కావడంతో, దళిత గిరిజనులకు 3 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. పంటను ధ్వంసం చేసిన ట్రాక్టర్కు అడ్డుగా నిలిచిన దళిత గిరిజనులపైకి ట్రాక్టర్ దూకించారని, భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరించారని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపాలెంలో అగ్రకుల రైతులకు భూములు ఉన్నప్పటికీ, దళిత గిరిజనులు బాగు చేసిన భూమిలో 6 ఎకరాలు ఆక్రమించారని, మరో 20 ఎకరాలు ఆక్రమించేందుకు ఎడ్ల మల్లయ్య, వీఆర్వో రమణారెడ్డి కుట్ర చేశారన్నారు. ఎడ్లమల్లయ్య ముఠాను అరెస్టు చేయాలని, వీఆర్వో రమణారెడ్డిని సస్పెండ్ చేయాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారని, ఒంగోలు ఆర్డీవోను కలెక్టర్ విచారణ అధికారిగా నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రకాశం జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, దళిత నాయకులు కాకుమాను రవి, మక్కెన వర కుమార్, కన్నా, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వ్యాప్తంగా నిరసనలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)

గత రెండు నెలలకు పైగా పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో పిడి, బి.అర్జునరావుకు బకాయిల విడుదల కోరుతూ అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కూలీలు వేతన బకాయిల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని అన్నారు. వ్యవసాయ పనులు లేక, ఉపాధి హామీ పనుల వేతనంతో జీవనం వెళ్ళబోసుకుందామంటే వాటిని ప్రభుత్వం నెలల తరబడి ఆపటం అమానుషమని అన్నారు. జిల్లాలో సుమారుగా 40 కోట్ల వేతన బకాయి ఉందని అన్నారు తక్షణమే బిల్లులు విడుదల చేసి పేదలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈనెల 23 మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి రెండున్నర లక్షల కోట్లు నిధులు కేటాయించాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల ఫలితంగా పని దినాలు కుధించబడు తున్నాయని కనుక ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం 600 వచ్చే విధంగా ప్రభుత్వాలు చర్య తీసుకోవాలని అర్జీ సమర్పించడం జరిగింది. సోమవారం జిల్లాలో సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, కొండేపి, పామూరు, హనుమంతునిపాడు, సిఎస్పురం తదితర మండలాలలో ఉపాధి బిల్లుల కోసం కూలీలు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ, బి అర్జునరావు ఈనెల 25వ తేదీ లోపు ఉపాధి కూలీల బిల్లుల మొత్తం విడుదల చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఆగిపోయిన పనులను కూడా అన్ని ప్రాంతాల్లో పునర్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. బడ్జెట్ పెంపుదల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు యడ్లపల్లి ఇర్మియ, చింతపల్లి ఏలియా తదితరులు పాల్గొన్నారు.

# తృటిలో తప్పించుకున్న మేయర్ భర్త జయవర్ధన్

## చెన్నైలోని జాగ్ హోటల్‌లో పోలీసుల దాడులు

## అక్కడి నుంచి తప్పించుకొని వెళ్లిన జయవర్ధన్

## ముమ్మరంగా గాలిస్తున్న పోలీసు బృందాలు

## నేడో....రేపో అరెస్టు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 22)

నెల్లూరు నగర పాలక సంస్థలో సంచలనం కలిగించిన కమిషనర్ల ఫోర్జరీ కేసుకు సంబంధించి నిందితుడిగా ఉన్న మేయర్ భర్త పొట్లూరి జయవర్ధన్ చెన్నైలోని జాగ్ హోటల్‌లో పోలీసుల వల నుంచి తృటిలో తప్పించుకున్నట్లు సమాచారం. ఈ కేసులో మొత్తం ఏడు మంది నిందితులుగా ఉన్నారు. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న జయవర్ధన్‌ను అరెస్ట్ చేసేందుకు నెల్లూరు నుంచి పోలీసు బృందాలు చెన్నైకి చేరుకున్నాయి. చెన్నై పోలీసులతో కలిసి స్థానిక జాగ్ హోటల్లో జయవర్ధన్ ఉన్నట్లు వారు నిర్ధారించుకున్నారు. అందుకు సంబంధించి పక్కా సమాచారం తోపాటు జయవర్ధన్ హోటల్‌లో ఉన్నట్లు ఫోటోలను కూడా పోలీసు నిఘా వర్గాలు తెప్పించుకొని రూఢీ చేసుకున్నారు. ఇక ఆయన్ని అరెస్టు చేసి నెల్లూరు తీసుకుని వచ్చేందుకు పోలీసు బలగాలు పక్కా వ్యూహాన్ని అమలు పరుస్తున్న నేపథ్యంలో మేయర్ భర్త జయవర్ధన్ అక్కడి నుంచి తృటిలో తప్పించుకున్నారు. జయవర్ధన్ తో పాటు ప్రధాన అనుచరుడు శివకృష్ణను అరెస్టు చేసేందుకు పోలీసు బలగాలు విస్తృతంగా గాలింపు చేస్తున్నాయి. జాగ్ హోటల్ నుంచి తప్పించుకున్న జయవర్ధన్ చెన్నై పరిసర ప్రాంతాల్లోనే ఉన్నట్లు నెల్లూరు పోలీసు బృందాలు అనుమానిస్తున్నాయి. కొంతమంది ఆయనకు సహాయం చేస్తున్నట్టు కూడా వారు గుర్తించారు. పోలీసులు కూడా అందుకు అనుగుణంగా పక్కా వ్యూహంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. జయవర్ధన్‌ను నేడో ...రేపో అరెస్టు చేసి నెల్లూరుకు తీసుకుని వచ్చే అవకాశాలు ఉన్నాయి. అలాగే మొత్తం ఏడు మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచనున్నారు.

# పియం కౌశల్ వికాస్ యోజన పథకం కింద యువత శిక్షణపై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 22)




ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం క్రింద దేశం, ఆంధ్రప్రదేశ్‌లో యువతకు శిక్షణా కోర్సులు ఏర్పాట్లు, గత ఐదేళ్లలో నమోదు కాబడిన విద్యార్థులు, సెంటర్లకు కేటాయించిన నిధులు, ఈ పథకం గురించి ప్రజలకు తెలియజేసే కార్యక్రమాల గురించి కేంద్ర చర్యల ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి , వ్యవస్థాపకత శాఖ (స్వతంత్ర) సహాయక మంత్రి, జయంత్ చౌదరి సమాధానమిచ్చారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద దేశంలోని యువతకు శిక్షణా కోర్సులు కల్పించుటకు ధృడమైన వాటాదార్ల వ్యవస్థ స్థాపించబడినదని, జాతీయ , అంతర్జాతీయ సమగ్ర నైపుణ్య అంచనాలను నిర్ధారించడానికి, ఆధ్యయనం చేయడానికి జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ పలు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ పథకం కింద, అన్ని శిక్షణా కోర్సులు జాతీయ అర్హత రిజిస్టర్ నుంచి తీసుకోబడి, పరిశ్రమల సంప్రతింపులతో అభివృద్ధి చేయబడునన్నారు. ఈ పథకం గురించి ప్రజలకు అన్ని మాధ్యమాల ద్వారను, సోషల్ మీడియా మాధ్యమాల ద్వారను, ప్రభుత్వ, ప్రైవేటు న్యూస్ ఏజెన్సీస్‌ల ద్వారాను తెలియజేయడం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో, దేశం మొత్తంలో 51,47,090 మంది, ఆంధ్రప్రదేశ్ లో 31-04-2024 నాటికి 1,13,884 మంది అభ్యర్థులు నమోదయ్యారని, ఈ పథకం కింద నేరుగా జిల్లాలకు నిధులు కేటాయించబడవని, రాష్ట్రాలవారీగా కేటాయించబడునని కేంద్ర మంత్రి తెలిపారు.

# దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ

## తడుకు చెందు

## ఏబీవీపీ నాయుడుపేట శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, జులై 22)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయుడుపేట శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుడుకు చందు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఢిల్లీలో యూనివర్సిటీలో ఓం ప్రకాష్ అనే ప్రొఫెసర్ కేవలం నలుగురితో షాట్ చేసిన ఉద్యమం ఇప్పుడు ఈ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థుల సంఘం ఏదైనా ఉందంటే అది కేవలం అఖిల భారత విద్యార్థి పరిషత్ ఏబీవీపీ మాత్రమే అంతేకాకుండా ఈ విద్యార్థి పరిషత్ లో పనిచేసిన కార్యకర్తలు ఎంతో గొప్ప స్థాయిలో ఉన్నారు. ఈ రాష్ట్రంలో భారత్ మాతాకీ జై నినాదం పలికే విద్యార్థి సంఘం ఏదైనా ఉందంటే అది ఏబీవీపీ మాత్రమే అదేవిధంగా వందేమాతరం అని నినాదించే విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఈ రాష్ట్రంలోనే కాదు ఈ దేశంలోనే అతిపెద్ద విద్యార్థుల సంఘం ఏదైనా ఉందా అంటే అది ఖచ్చితంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ మాత్రమే నేను కచ్చితంగా చెప్తా మళ్ళీ మళ్ళీ చెప్తా ఈ దేశం కోసం పని చేస్తున్నటువంటి విద్యార్థి సంఘం ఏదైనా ఉందంటే అది కచ్చితంగా అఖిల భారతి విద్యార్థి పరిషత్ మాత్రమే అని మీరు అన్నారు. ఈ కార్యక్రర్తలు వినయ్, అఖిల్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు పనిచేసే ప్రదేశంలో కమిటీలు ఏర్పాటు చేయాలి

## నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 22)

పనిచేసే ప్రదేశంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తూ వారి గౌరవాన్ని కాపాడేందుకు తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కలిగించేందుకు తయారుచేసిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సోమవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ , డి ఆర్ ఓ లవన్న , ఐ సి డి యస్ పిడి హేనసుజన్ , డి యం హెచ్ ఓ పెంచలయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైగికంగా జరిగే దాడులను నిరోధించేందుకు ప్రతి కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేయవలసినదిగా, సదరు కమిటీలలో సీనియర్ మహిళా ఉద్యోగి తో పాటు ఎన్ జి ఓ ఉండేట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక హింస వేధింపుల నివారణ చట్టంను అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ విషయమై మహిళా ఉద్యోగులందరికీ సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## నెల్లూరు జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 63 ఫిర్యాదులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 22)

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను నెల్లూరు జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఆదేశించారు. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్పీ జి. కృష్ణ కాంత్, సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా యస్.పి. మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 63 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదుల్లో కొన్ని.....బ్రెయిన్ కాపిటల్ కంపెనీ అనే నకిలీ సంస్థలో వాటా పేరుతో కోటి ఎనభై లక్షలు నగదు తీసుకొని మోసం చేసిన వారి పై చర్యలు తీసుకొని మా డబ్బులు తిరిగి ఇప్పించాలని వేదాయపాలెంనకు చెందిన ఆవుల కార్తీక్ ఫిర్యాదు చేసారు. అధిక కట్నం కోసం, అత్త, మామ, భర్త వేధింపులకు గురి చేస్తున్నారు అనే విషయమై నెల్లూర్ టౌన్ కు చెందిన మహిళ ఫిర్యాదు చేసారు. దివ్యాంగురాలను ప్రేమ పేరుతో మోసం చేసి, పెళ్ళికి నిరాకరించిన ఉలవపాడు మండలానికి చెందిన వ్యక్తిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. హత్యాయత్నం కేసులో ముద్దాయిపై త్వరితగతిన చర్యల కొరకు నవాబ్ పేటకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేసారు. భర్త మరణాంతరం భర్తకు సంబంధించిన ఆస్థి విషయమై అత్తింటివారి వేధింపుల గురించి నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళ ఫిర్యాదు చేసారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ గారు హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా యస్.పి., అడిషనల్ యస్.పి.(క్రైమ్స్) ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఎస్ వాటర్ సర్వీసింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆకుపాటి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 22)

పామూరు పట్టణంలోని స్థానిక నెల్లూరు రోడ్డు నందు కంప పెంచలయ్య , పిబిండి కార్తీక్ ఇరువురు ప్రొప్రైటర్స్ ఏర్పాటు చేసిన నూతన ఎస్ఎస్‌వాటర్ సర్వీసింగ్‌ను ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుపాటి రమణయ్య, రెండో ప్రదేశిక ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ రిబ్బన్ కట్ చేసి ప్రా రంభించారు. అనంతరం ఆకుపాటి మాట్లాడుతూ నూతన ప్రారంభించిన సర్వీసింగ్ దినదిన అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మిత్రులు, వారి శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# పొదిలి చిన్నచెరువు విధ్వంసానికి కారకులైన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి

## సీపీఐ పొదిలి మండల సెక్రటరీ కె వెంకటరత్నం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 22)




గత కొన్ని సంవత్సరాలుగా పొదిలి చిన్న చెరువు నుంచి మట్టినిత్రవ్వి కోట్లరూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్న చూసి చూడనట్లు వ్యవహరించిన సంబంధిత ఇరిగేషన్ రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ తరపున డిమాండ్ చేస్తునామని సీపీఐ సెక్రటరీ కె.వెంకటరత్నం తెలిపారు. పొదిలి చిన్న చెరువు 100 ఎకరాలకు పై చిలుకు విస్తీర్ణంలో కొంత భాగం భూకబ్జాదారుల ఆక్రమణలోకి వెళ్ళిపోగా మిగిలిన కొంత భాగాన్ని ఇలా మట్టి రూపంలో 20 అడుగులలోతు వరకు తవ్వి చెరువును ధ్వంసం చేసి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల చెరువు ధ్వంసానికి కారకులైన అధికారులను సస్పెండ్ చేసి వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో సంబంధిత జిల్లా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి కఠిన చర్యలు తీసుకోవాలని భారతకమ్యూనిష్టు పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

# ముందస్తు చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టరు ఆనంద్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 22)

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టరు ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షం రాకముందు, వచ్చిన తరువాత చేపట్టాల్సిన చర్యలపై పూర్తిగా సన్నద్ధత కావాలన్నారు. ప్రధానంగా ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చోట చెరువు కట్టల మరమ్మతులు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డిఆర్‌వో లవన్న, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, ఇరిగేషన్, విద్యుత్, సోమశిల ఎస్ఇలు కృష్ణమోహన్, విజయన్, వెంకటరమణారెడ్డి, జడ్పీ సిఇవో కన్నమనాయుడు, ఉద్యానవనశాఖాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను అవమానించినప్పుడు ఏమైంది

## మూడు సింహాలు, ఇప్పుడు కనపడ్డాయా?

## టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 22)

పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డికి మూడు సింహాలు, ఇప్పుడు కనపడ్డాయా అని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్‌భాష సోమవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. గత ఐదేళ్లు, మా నాయకుడు నారా చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు, వైజాగ్ ఎయిర్పోర్ట్‌లో అవమానించేటప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జగన్ మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లలో టీడీపి కార్యకర్తలు, నాయకులను అక్రమ అరెస్టు చేపించే తప్పుడు, అప్పుడు గుర్తు రాలేదా జగన్మోహన్‌రెడ్డి మూడు సింహాలు అని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని వైజాగ్‌లో అడ్డుకునప్పుడు ఏమైంది జగన్‌రెడ్డి. ఖర్మ ఎవ్వరిని వదిలిపెట్టదు. ఎవరైనా అనుభవించాల్సిందేనని ఆయన మండిపడ్డారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com